క్లుప్తంగా

అధ్యాపకులకు డాక్టరేట్లు


డి.కే. నరసింహులు


కె. నాగేశ్వరరెడ్డి

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో పని చేస్తున్న ఇద్దరు అధ్యాపకులకు డాక్టరేట్లు వచ్చాయని ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులుగా పని చేస్తున్న నరసింహులు, నాగేశ్వరరెడ్డిలకు చిదంబరంలోని అన్నమలై యూనివర్సిటీ డాక్టరేట్లను ప్రదానం చేసిందన్నారు. డాక్టరేట్లు పొందిన అధ్యాపకులను చెర్మన్ శాంతిరాముడు, డైరెక్టర్ శివరాం, డీన్ అశోక్‌మార్, హెచ్‌ఓడీ సుబ్బారెడ్డి సిబ్బంది, స్నేహితులు అభినందించారు.

ఆలయ నిర్మాణం పరిశీలన

కోడుమూరు రూరల్: దాతల సహకారంతో రూ.9 కోట్ల వ్యయంతో కోడుమూరులో పునర్నిర్మిస్తున్న శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయాన్ని బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ తూముకుంట ప్రతాప్‌రెడ్డి, జైశ్రీరామ్ ఫౌండేషన్ కర్నూలు జిల్లా కన్వీనర్ నాగేశ్వరరావు శనివారంపరిశీలించారు. కార్యక్రమంలో సభ్యులు యుగంధరశెట్టి, బీర్రు ప్రతాప్‌రెడ్డి, శేషయ్య, రామక్రిష్ణ, వెంకటరమణ, రఘునాథ్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు రాజశేఖర్, వేణుగోపాల్, తిమ్మారెడ్డిలు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో ఏడుగురికి గాయాలు


గాయపడిన రఫీ

గడివేముల: మండల కేంద్రమైన గడివేములలోని బీసీ కాలనీలో శనివారం ఓ పిచ్చి కుక్క దాడి చేయ డంతో ఏడుగురు గాయాలపాలయ్యారు. గ్రామానికి చెందిన లవంగాల రఫీ, ప్రవీణ్‌కుమార్, మాబాషా, అన్వర్ బాషా, అల్వరేష్, రేగడగూడూరుకు చెందిన సురేంద్ర, కొర్రపాలూరు చెందిన ప్రదీప్‌లపై దాడి చేసి గాయపరిచింది. బాధితులకు స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ మొల్లా జబీన్ వైద్య పరీక్షలు నిర్వహించి టీకాలు వేశారు. గ్రామంలో కుక్కలు బెడద ఎక్కువగా ఉందని, సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వేధింపుల కేసు నమోదు

కల్లూరు: మండల పరిధిలోని ఉలిందకొండ పోలీసు స్టేషన్‌లో వేధింపుల కేసు నమోదైనట్లు ఎస్ఐ నల్లప్ప తెలిపారు. లక్ష్మీపురం గ్రామానికి చెందిన జి.లాస్య అలియాస్ ముఖాంభికకు ఆత్మకూరు పట్టణానికి చెందిన లింగస్వామి అలియాస్ మందగిరి లింగమయ్యతో జూన్ 10, 2022న వివాహమైంది. వివాహ సమయంలో ఆరు తులాల బంగారు ఆభరణాలు, లక్ష రూపాయలు కట్న కానుకలు ఇచ్చారు. సంవత్సరం పాటు అన్యోన్యంగా కాపురం సాగింది. అయితే రెండు నెలల నుంచి అత్త రాముల్లమ్మ, మామ రామకృష్ణ, మరిది ఫణీంద్ర రూ.ఐదు లక్షలు అదనపు కట్నం తీసుకురావాలని, లేని పక్షంలో ఇంటి నుంచి వెళ్లిపోవాలని వేధించసాగారు. చాలా సార్లు కొట్టి ఇంటి నుంచి గెంటివేశారు. అలాగే నీవు అందంగా లేవు సన్నగా ఉంటావని, సూటిపోటి మాటలతో మానసికంగా, శరీరకంగా హింసిస్తున్నారు. ఈ మేరకు శనివారం బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త, అత్త, మామ, మరిదిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

బాల్యవివాహాలు చేస్తే కేసులు


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గడివేముల: ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే కేసులు నమోదు చేస్తామని అసిస్టెంట్ సీడీపీఓ పద్మావతి హెచ్చరించారు. శనివారం మండల మండల కేంద్రమైన గడివేముల జెడ్పీ స్కూల్ వద్ద నుంచి పాత బస్టాండు వరకు బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నిషేద చట్టం-2006 ప్రకారం మైనర్లకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలు చేసే కుటుంబాలపైన చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. అమ్మాయికి 18, పురుషుడికి 21 ఏళ్లు పూర్తయ్యే వరకు వివాహం చేయరాదని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జయలక్ష్మి, కళావతి, అంగన్‌వాడీ టీచర్లు రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు సకాలంలో పూర్తి చేయాలి

కోడుమూరు రూరల్: ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను సెప్టెంబరు 15వ తేదీలోగా నమోదు చేయాలని మండల వ్యవసాయాధికారి రవి ప్రకాష్ ఆర్‌బీకే సిబ్బందిని ఆదేశించారు. శనివారం మండలంలోని లద్దగిరి, ఎర్రదొడ్డి గ్రామాల్లో ఏఓ పర్యటించి పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. రైతులు సాగు చేసిన ప్రతి పంటను నమోదు చేయాలని, పంట నమోదు ఉంటేనే ప్రభుత్వమందించే పంట బీమా, గిట్టుబాటు ధర లభిస్తాయన్నారు.

పల్లెల అభివృద్ధికి ‘ఆర్థిక’ సహకారం

- గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం మంజూరు
- గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ఉపయోగం
- హర్షం వ్యక్తం చేస్తున్న సర్పంచ్‌లు

గడివేముల: నాలుగున్నరేళ్ల క్రితం రాష్ట్రంలో ఏ పంచాయతీ అభివృద్ధికి నోచుకోలేదు సరికదా! సరైన సౌకర్యాలు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడేవారు. గ్రామంలో ఇద్దరు ముగ్గురు కంటే ఎక్కువ మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉండేవారు కాదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ప్రతి గ్రామంలోనూ పది మందికి పైగా ప్రభుత్వ సిబ్బందిని నియమించి పల్లెల్లోనే సమస్యలకు పరిష్కారం చూపుతున్నారు. అంతేకాకుండా ప్రాధాన్యతా క్రమంలో గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందుకు అనుగుణంగా 15వ ఆర్థిక సంఘం ద్వారా 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను మొదట విడత నిధులను విడుదల చేశారు.

ఎప్పటికప్పుడు బిల్లుల చెల్లింపు

మండలంలోని 14 గ్రామ పంచాయతీలకు గాను రూ.32,22,536 ఆయా పంచాయతీల పీడీ ఖాతాలకు జమకానున్నాయి. అయితే పంచాయతీల్లో చేపట్టే అభివద్ధి పనులకు సంబంధించిన బిల్లులను గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలోనే ఎప్పటికప్పుడు చెల్లింపులకు వీలుగా ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించారు. ఈ నిధులపై రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షణ ఉంటుంది. పంచాయతీలలో వివిధ ఖర్చులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రామ స్వరాజ్య ఈ-పోర్టల్లో నమోదు చేయాల్సి ఉంటుంది. దీంతో లావాదేవీల వివరాలు సమాచారం ఎప్పటికప్పుడు పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులకు తెలుస్తుంది. ప్రభుత్వ ట్రెజరీ అనుమతులు, లేదా ఇతర ఉన్నతాధికారుల జోక్యం కూడా ఎక్కడా ఉండదని పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు.

ఖర్చు చేయాల్సిన విధి విధానాలు..

పంచాయతీలకు జమ అయిన నిధులను టైడ్ అన్ టైడ్ భాగాలుగా విడగొట్టి మొదటి భాగంలో అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణం, కరెంటు బిల్లుల చెల్లింపు, గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ, హెల్త్ సెంటర్, పంచాయతీ భవనాల అభివద్ధికి వినియోగించుకోవాలి. వీటితో పాటు శ్మశానవాటికల అభివద్ధికి కూడా వినియోగించుకోవచ్చు. ఈ పంచాయతీ నిర్వహణకు కంప్యూటర్ విడి భాగాలు కొనుగోలు చేసేందుకు కూడా వినియోగించుకోవచ్చు. రెండో భాగంలో ప్రధానంగా తాగునీటి పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు, చేతి పంపులు, నీటి ట్యాంకులు, మోటార్ల నిర్వహణ బాధ్యతను ఆయా పంచాయతీలే చూసుకోవాలి. అవసరమైతే మరమ్మతులు చేయించాలి. 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలతో పంచాయతీ సర్పంచ్‌లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



గని గ్రామ సచివాలయం

గ్రామాల అభివృద్ధికి ఎంతో ఉపయోగపడతాయి



15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాలను మరింత అభివృద్ధి చేయవచ్చు. ముఖ్యంగా గ్రామంలో కొన్ని నెలల నుంచి తాగునీటి మరమ్మతులకు నిధులను వాడుకోవడంతో పాటు గ్రామంలో ఉన్న సమస్యలను తొలగించవచ్చు. గ్రామాల అభివృద్ధి కోసం నిధులను మంజూరు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా కృతజ్ఞతలు. – మండ్ల మమత, దుర్వేశి సర్పంచ్

మార్గదర్శకాల ప్రకారం ఖర్చు...



కేంద్ర ప్రభుత్వం ద్వారా విడుదలైన రెండో విడత 15 ఆర్థిక సంఘం నిధులు పంచాయతీల పీడీ ఖాతాలకు జమచేయనున్నాం. ఈ నిధులకు సంబంధించి విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం ఖర్చు చేయాలి. ప్రాధాన్యత, మార్గదర్శకాల ప్రకారం ఖర్చు చేసి సమస్యలను పరిష్కరించాల్సి ఉంది. వివిధ అభివృద్ధి పనులకు ఉపయోగించిన నిధులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రామ స్వరాజ్య ఈ పోర్టల్లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ బిల్లులపై ప్రభుత్వం ఏటా ఆడిట్ నిర్వహిస్తుంది. తప్పులు దొర్లితే సంబంధిత సర్పంచ్, కార్యదర్శులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. –అబ్దుల్ ఖాలీక్, ఈఓపీఆర్‌డీ, గడివేముల

గ్రామ పంచాయతీ పేరు	15వ ఆర్థిక సంఘం మంజూరైన నిధులు (రూ.లక్షల్లో)
బిలకలగూడూరు	2,99,537
బూజునూరు	1,29,299
చిందుకూరు	1,96,072
దుర్వేశి	1,59,428
గడిగరేవుల	1,23,602
గడివేముల	3,97,946
గని	2,13,311
కె.బొల్లవరం	85,379
కరిమద్దెల	4,72,762
కొరటమద్ది	1,33,769
కొర్రపాలూరు	86,776
ఎల్‌కే తాండ	1,75,107
మంచాలకట్ట	2,08,288
ఒండుట్ల	1,19,867
పెసరవాయి	3,07,529
తిరుపాడు	1,13,864

గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి

గూడూరు రూరల్ : జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు చేపట్టిన గృహాల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ మాధవీలత సూచించారు. కె.నాగలాపురంలో గృహ నిర్మాణాలను శనివారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ జగనన్న కాలనీలో ఇప్పటికే 40 శాతం మేరకు గృహాలు పూర్తి కావచ్చాయని, మిగిలి ఉన్న నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. రెండు నెలల్లో పనులు పూర్తి చేయించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

కేసీకి నీటి విడుదల

గూడూరు: సుంకేసుల జలాశయం నుంచి కేసీ కాల్వకు 331 క్యూ సెక్కుల నీరు విడుదల చేసినట్లు శనివారం డ్యాం అధికారులు తెలిపారు. జలాశయానికి ఎగువ నుంచి ఇన్ ఫ్లో నిలిచి పోయిందని వెల్లడించారు. ప్రస్తుతం 0.751 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వారు తెలిపారు.

జీవనోపాధులు ఏర్పాటు చేసుకోవాలి

ఓర్వకల్లు: మహిళలు ప్రభుత్వం అందజేస్తున్న రుణాల ద్వారా చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని సుస్థిరమైన జీవనోపాధులను పొందాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల అన్నారు. శనివారం మండలంలోని నన్నూరు గ్రామానికి చెందిన బోయ ఈశ్వరమ్మ యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో ఏర్పాటు చేసుకున్న రూ.2 లక్షల విలువచేసే పిండి మిషన్‌ను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ, పొదుపు సంఘాలలో వున్న ఎక్కువమంది మహిళలు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతరం లబ్ధిదారులకి చెక్కును అందచేశారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీధర్‌రావు, ఏపీఎం వెంకటరామిరెడ్డి, మండల మహిళ సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు విజయలక్ష్మి, మైమున్నీషాబేగం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను విమర్శించే అర్హత లేదు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గూడూరు: ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌ను విమర్శించే అర్హత టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు జూలకల్లు సుధాకర్‌రెడ్డికి లేదని వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బోయ లక్ష్మన్న, కౌన్సిలర్లు నంద కిషోర్, టీచర్ కిషోర్, వలి, జూలకల్లు దామోదర రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కమిటీ కన్వీనర్ జె.ఆబేల్ తదితర నాయకులు మాట్లాడుతూ.. జెడ్పీటీసీగా ఉన్న సమయంలో జూలకల్లు సుధాకరరెడ్డి ఎన్నో భూ కబ్జాలకు పాల్పడ్డారని విమర్శించారు. ప్రభుత్వ సొమ్ముతో గృహం నిర్మించుకున్నారని ఆరోపించారు. అలాంటి అక్రమార్కుడు తమ ఎమ్మెల్యేపై విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు సత్యాలు, జూలకల్లు కాంతారెడ్డి, మునుగాల రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

గార్గేయపురం అభివృద్ధికి పాటుపడతాం

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం గార్గేయపురం గ్రామ అభివృద్ధికి పాటుపడతామని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. శనివారం గార్గేయపురంలో రూ.10లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ముందుగా సీఎస్ఐ చర్చి ఫాదర్ ఇమ్మానియేలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం టెంకాయ కొట్టి సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆ తర్వాత సీఎస్ఐ చర్చిలో ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్‌ను సీఎస్ఐ సంఘ సభ్యులు శాలువా, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఆ తరువాత పీహెచ్‌సీ ఎదురుగా నూతనంగా నిర్మించినున్న సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అలాగే గ్రామంలో ఎమ్మెల్యే, గ్రామ పంచాయతీ నిధులతో నూతనంగా వేసిన మంచినీటి బోరును ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి, బటన్ నొక్కి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కోడుమూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి పాటుపడతానన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తేనె జ్యోతిలత, సొసైటీ చైర్మన్ వినయ్‌కుమార్‌రెడ్డి, ఉప సర్పంచ్ కౌశిక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఏసేపు, వైస్ ఎంపీపీ2 నెహెమ్యా, మాజీ మండల ఉపాధ్యక్షులు వాసు, ఉప సర్పంచ్ మల్లిశివుడు తదితరులు పాల్గొన్నారు.


మంచినీటి బోరును ప్రారంభించిన కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కొత్తకోటవి చిల్లర రాజకీయాలు

- డబ్బులిచ్చినట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం
- కోడుమూరు జెడ్పీటీసీ, గూడూరు ఎంపీపీ సవాల్


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి

కోడుమూరు: మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాష్‌రెడ్డి తన ఉనికిని కాపాడుకునేందుకు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని కోడుమూరు జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, గూడూరు ఎంపీపీ సునీత విమర్శించారు. శనివారం కోడుమూరులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డిపై లేనిపోని ఆరోపణలు చేసి ప్రజల దృష్టిని తనవైపు మళ్లించుకోవడం కోసం ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. తన రాజకీయ ఎదుగుదల కోసం బడుగు బలహీన వర్గాల ప్రజలను హత్య చేయించిన చరిత్ర కొత్తకోటదేనన్నారు. తాను గూడూరు ఎంపీపీ పదవి కోసం డబ్బులిచ్చినట్లు నిరూపిస్తే పదవికి రాజీనామా చేస్తానని, లేదంటే మీరు రాజకీయాల నుంచి తప్పుకుంటారా అని సునీత సవాల్ విసిరారు. సమావేశంలో సింగిల్ విండో అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, ఉపసర్పంచు మాదులు, వైఎస్ఆర్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఆదిమూలపు సతీష్, స్టేట్ కమిటీ మెంబర్ సంధ్యవిక్రమ్, నేతలు ఈశ్వర్‌రెడ్డి, సోమన్న, మల్లారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రమేష్‌నాయుడు, రవికుమార్‌రెడ్డి, తిమ్మారెడ్డి, బందెనవాజ్, తేనేశ్వరరెడ్డి, గిడ్డయ్య, వెంకటేశ్వరరెడ్డి, రాఘవేంద్ర, లింగన్న తదితరులున్నారు.

ఓర్వలేక విమర్శలు

సి.బెళగల్: కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ బలోపేతాన్ని చూసి ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాష్‌రెడ్డి చౌకబారు విమర్శలు చేస్తున్నారని ఆపార్టీ సి.బెళగల్ మండల నాయకులు అన్నారు. శనివారం పార్టీ మండల కార్యదర్శి ముందరింటి వెంకటేష్ స్వగృహంలో మండల నాయకులు సమావేశమై కొత్తకోట ప్రకాష్ రెడ్డి తీరును ఎండగట్టారు. వైస్ ఎంపీపీ తలారి బీసమ్మ ఎన్నికపై ప్రకాష్‌రెడ్డి చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. సమావేశంలో నాయకులు నరసింహుడు, సంగాల మాజీ సర్పంచ్ రాఘవేంద్ర, శంకర్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, ముందరింటి గోపాల్, పులిరాజు, నాగేశ్వరరెడ్డి, సి.బెళగల్ సర్పంచ్ పాండురంగన్న బాలరాజు, కరుణాకర్‌రెడ్డి, వెంకటేష్, బొజ్జన్న, హరున్ తదితరులు పాల్గొన్నారు.

సినీ రంగానికి మూలం నాటకం

కర్నూలు కల్చరల్: సినీ రంగానికి మూలం నాటక రంగమని రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య, విశ్రాంత ఐఏఎస్ బలరామయ్య, ప్రజా నాట్య మండలి వేదిక కన్వీనర్ డాక్టర్ శాంతారామ్ అన్నారు. కళా విపంచి, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో సీక్యాంప్‌లోని టీజీవీ కళాక్షేత్రంలో రెండో రోజు శనివారం సాంఘిక నాటకాల ప్రదర్శనలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమలో సాంఘిక నాటక రంగం వెనకబడి ఉందన్నారు. అందుకే సినీ రంగంలో రాయలసీమ కళాకారుల సంఖ్య చాలా తక్కువగా ఉందన్నారు. కళలను, కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ త్వరలో ఒక అకాడమి ఏర్పాటు చేసి యువతకు నటనలో శిక్షణ ఇచ్చేలా కృషి చేస్తామన్నారు. అనంతరం డీఎస్ దీక్షిత్ స్మారక పురస్కారాన్ని పొన్నూరుకు చెందిన ప్రముఖ నాటక, సినీ రచయిత, నటుడు ఎస్. కృష్ణేశ్వరరావుకు అతిథులు అందజేశారు. అనంతరం ప్రదర్శించిన పొన్నూరు రసఝరి వారి ‘త్రిజుడు’, కట్రపాడు ఉషోదయ కళానికేతన్ వారి ‘ప్రక్షాళన’ నాటకాలు అలరించాయి. కార్యక్రమంలో కళావిపంచి అధ్యక్షులు బొప్పన నరసింహారావు, ముఖ్య సలహాదారులు డి. రామకోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి జి.వి.జి. శంకర్, కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, కోశాధికారి లక్ష్మీకాంతరావు, సభ్యులు సంగా ఆంజనేయులు, క్రిష్టఫర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వాల్మీకి రామాలయ ప్రారంభోత్సవం


సీతారాముల వారిని దర్శించుకుంటున్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి


వాల్మీకి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్ శ్రీ వాల్మీకి రామాలయ ప్రారంభోత్సవ, దేవతా మూర్తులు, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా సాగాయి. మూడవ రోజైన శనివారం పురోహితులు శ్రీ ములుకుంట్ల ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో పండిత బృంద సభ్యులు సుదర్శణ ఆచార్యుల పర్యవేక్షణలో వేద పండితులు ఆలయ ప్రారంభ, ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించారు. తెల్లవారుజామున 5:06 గంటలకు ఆలయ గర్భగుడిలో శ్రీ లక్ష్మణ, ఆంజనేయ సీతారాముల సమేత దేవతా మూర్తులను ప్రతిష్ఠించారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో నవగ్రహ, శ్రీ సుబ్రహ్మణ్య సాముల విగ్రహాలను ప్రతిష్ఠించిన అనంతరం, ఆదికవి శ్రీ వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఆవిష్కరించారు. 10 గంటలకు 30 అడుగుల భారీ ధ్వజ స్తంభాన్ని క్రేన్ సహాయంతో ప్రతిష్ఠింపజేశారు. మధ్యాహ్నం 12 గంటలకు శ్రీసీతారాముల ఉత్సవ మూర్తులకు కల్యాణం కమనీయంగా సాగింది. సాయంత్రం ఉత్సవ మూర్తులను పల్లకీలో ఘనంగా ఊరేగించారు. గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు కోడుమూరు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్, ‘కుడా’ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ఇతర నాయకులు, ప్రజా ప్రతినిధులు స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మధ్యాహ్నం నుంచి గ్రామానికి చెందిన ఆడపడచులు పెద్ద సంఖ్యలో పుట్టింటి ఒడి బియ్యం, చీరలతో ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ పీరయ్య పోలీస్ బందోబస్తును నిర్వహించారు.


ప్రతిష్ఠించిన రాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పూజారులు


సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

నాపరాయి లారీల పట్టివేత

కర్నూలు (న్యూసిటీ) : అక్రమంగా నాపరాయి తరలిస్తున్న ఐదు లారీలను శుక్రవారం రాత్రి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. బేతంచెర్ల నుంచి కర్నూలు వైపు వస్తున్నట్లు సమాచారం అందడంతో నగర శివారులో వారు తనిఖీలు చేపట్టారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి మైనింగ్ అధికారులు అప్పగించారు. ఈ విషయాన్ని మైనింగ్ డీడీ రాజశేఖర్ శనివారం తెలిపారు. పట్టుబడిన లారీలకు రూ.5 లక్షలు జరిమానా విధించామని వెల్లడించారు.

వలంటీర్ నియామకాలకు ఇంటర్వ్యూలు


వలంటీర్ల నియామకానికి ఇంటర్వ్యూ చేస్తున్న ఈఓఆర్డీ సందీప్

సి.బెళగల్: మండల పరిధిలో ఖాళీగా ఉన్న ఐదు గ్రామ వలంటీర్ల నియామకానికి శనివారం ఈఓఆర్డీ సందీప్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఈ ప్రక్రియ జరిగింది. పోలకల్, కొండాపురం, సంగాల గ్రామాల్లో ఖాళీగా ఉన్న ఐదు వలంటీర్ పోస్టులకు మొత్తం 15 మంది దరఖాస్తు చేసుకున్నారు. 10 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరిలో ఎంపికైన వారి పేర్లను త్వరలో తెలియజేస్తామని ఈఓఆర్డీ తెలిపారు.

కోడుమూరు రూరల్: మండలంలోని లద్దగిరి, ఎర్రదొడ్డి గ్రామ సచివాలయాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు శనివారం కోడుమూరు ఎంపీడీఓ చంద్రశేఖర్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. లద్దగిరిలో రెండు పోస్టులకు ముగ్గురు, ఎర్రదొడ్డిలో ఒక పోస్టుకు ఒకరు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలంలో ఖాళీగా ఉన్న 12 వలంటీర్ పోస్టుల భర్తీకి శనివారం జెడ్పీలోని కర్నూలు ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీఓ అజాంఖాన్ మాట్లాడుతూ మండల పరిధిలోని ఖాళీగా ఉన్న 12 వలంటీర్ల నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహించగా 25 మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. ఈ నెల 28వ తేదీన అభ్యర్థుల ఎంపిక ఉంటుందని వెల్లడించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం


సుందరయ్యనగర్‌లో మహిళకు సంక్షేమ పథకాల క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధాకర్

కోడుమూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. శనివారం కోడుమూరులోని సుందరయ్యనగర్, బుడగజంగాల కాలనీల్లో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. తర్వాత ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమ కాలనీల్లో సీసీరోడ్లు, మురుగునీటి కాల్వలు నిర్మించాలని కొందరు, కొత్త కరెంట్ స్తంభాలు, వీధిలైట్లు వేయించాలని మరికొందరు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. గడపగడపకు కార్యక్రమం ద్వారా గ్రామ సచివాలయాలకు వచ్చే నిధులతో సీసీ రోడ్లు, మురుగునీటి కాల్వలు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. అలాగే అర్హులకు ఇళ్లు మంజూరు చేస్తానన్నారు.

ఇంటి ముంగిటకే పథకాలు

అనంతరం ఎమ్మెల్యే విలేకర్లతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గ్రామ సచివాలయాలు, వలంటరీ వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి ముంగిటకే చేరుతున్నాయన్నారు. తమ ప్రభుత్వ పాలనను చూసి ఓర్వలేక టీడీపీ నేతలు లేనిపోని విమర్శలు చేస్తున్నారని, వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏఓ రవిప్రకాష్, ఈఓఆర్డీ మంజుల, ఏపీఓ రమాదేవి, సర్పంచులు మధుసూదన్‌రెడ్డి, బాలక్రిష్ణ, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌యాదవ్, స్థానిక నేతలు అద్దుగల రాజశేఖరరెడ్డి, మధుమోహన్‌రెడ్డి, లాయర్ ప్రభాకర్, డా.షాకీర్‌బాషా, ప్రతాప్‌రెడ్డి, బలరాం, సుంకన్న పాల్గొన్నారు.

పంట నమోదుకు సహకరించాలి

గూడూరు రూరల్: పంటలను సాగు చేసిన రైతులు పంట నమోదుకు సహకరించాలని వ్యవసాయ అధికారి శ్రీవర్ధన్‌రెడ్డి సూచించారు. కె.నాగలాపురంలో జరుగుతున్న పంట నమోదును శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా పంటను నమోదు చేసుకోవాలన్నారు. ఇందుకు ప్రభుత్వం వచ్చే నెల 15 వరకు గడువు విధించిందన్నారు. ఇప్పటి వరకు 3,400 ఎకరాల వరకు (20 శాతం) పంటలను నమోదు చేశామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి రైతు వినియోగించుకోవాలని ఆయన తెలిపారు.

కల్లూరు: రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని, దీంతో రైతులకు ఎంతో ఉపయోగమని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం తడకనపల్లె గ్రామంలో ఈ-క్రాప్ నమోదును పరిశీలించారు. రైతులు తాము సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ నమోదు చేసుకోవడం ద్వారా వాతావరణ బీమా, ఫసల్ బీమా యోజన, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట కొనుగోలు వంటి ప్రభుత్వ సేవలను పొందవచ్చన్నారు.